క్లుప్తంగా

కొనసాగుతున్న కులగణన



వృద్ధురాలి నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్లు

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో కులగణన సర్వే శనివారం ఊపందుకుంది. వలంటీర్లు, గ్రామ/వార్డు సచివాలయ అధికారులు సర్వేలో నిమగ్నమయ్యారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మట్లాడుతూ కులగణన అన్ని గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. శ్రీశైలం మండలంలో కొంత తక్కువగా ఉందని, సున్నిపెంట సచివాలయ 1, 2 పరిధిలో చాలా తక్కువగా ఉండడంతో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశామన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించామన్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



కర్నూలుకు చెందిన దాతకు బాండు అందజేస్తున్న పర్యవేక్షకులు



గుంటూరుకు చెందిన దాతకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన జి.రామకృష్ణయ్య రూ.లక్ష , గుంటూరుకు చెందిన ఎం.రవికుమార్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. విరాళాల మొత్తాన్ని విరాళాల కేంద్రంలోని పర్యవేక్షకులు ఎ.నాగరాజు కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

సింధూరంతో శ్రీరాముని చిత్రం



సింధూరంతో శ్రీరాముని చిత్రం

నందికొట్కూరు: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఈ నెల 22వ తేదీన జరుగనున్న నేపథ్యంలో శనివారం చిత్రకారుడు దేశెట్టి శ్రీనివాసులు సింధూరంతో శ్రీరాముని చిత్రం గీశారు. ఆయన 11 రోజులు శ్రీరాముడి దీక్షలో ఉండి సింధూరంతో శ్రీరాముని చిత్రం గీశారు.

సామాజిక న్యాయం కోసమే కులగణన



సుబ్బారావుపేటలో సర్వే చేస్తున్న వలంటీరు, సచివాలయ ఉద్యోగులు

నందికొట్కూరు: సామాజిక న్యాయం కోసం కులగణన కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. శనివారం పట్టణంలో 29 వార్డులలో కులగణన వలంటీర్లు, సచివాలయ అధికారులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సర్వే పారదర్శకంగా చేపడుతున్నామని, వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారమని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



ఆయుష్మాన్ హెల్త్ కార్డులు అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జాతీయ మోర్చా కార్యవర్గ సభ్యురాలు షబారా, సర్పంచ్ వెంకటరమణ, కురుకుంద సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీడీఓ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని నల్లకాల్వ, కురుకుంద గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్హులైన వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆయుష్మాన్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. వికసిత్ కో ఆర్డినేటర్ చింత నాగేష్, కురుకుంద ,నల్లకాల్వ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరా



నా పేరు లీలావతమ్మ. మాది కరివే గ్రామంలో శ్రీరేణుక పొదుపు గ్రూప్. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసేటప్పటికి మా ఖాతాలో రూ.4.90 లక్షల అప్పు ఉండింది. ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆ మొత్తాన్ని రుణమాఫీ చేశారు. అందులో నా వంతుగా రూ.49 వేలు మాఫీ అయ్యింది. నాలుగు విడుతల్లో మాఫీ చేస్తామని చెప్పిన మాట మేరకు ఇప్పటికే మూడు విడతలు ఇచ్చారు. కొద్ది రోజుల్లో నాలుగో విడత విడుదల చేస్తారని అధికారులు చెప్పారు. ఒక్కో విడుతలో రూ.12,250 చొప్పున మూడు విడుతలుగా రూ.36,750 మాఫీ అయ్యింది. ఈ విడతలో రూ.12,250 మాఫీ కానుంది. మాట ఇచ్చి నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరే.



నా పేరు నారాయణమ్మ. మాది కరివేన గ్రామం. మా గ్రూప్‌లో 13 మంది సభ్యులున్నారు. రుణమాఫీలో మా గ్రూప్‌నకు రూ.5.60 లక్షలు మాఫీ అయ్యింది. ఒక్కో సభ్యురాలికి రూ.38,946 ప్రకారం రుణం మాఫీ అయ్యింది. ఇప్పటి వరకు రూ.9,736 చొప్పున మూడు విడుతలుగా రూ.29,209 మా ఖాతాల్లో జమ అయ్యింది. త్వరలో నాల్గవ విడుత రూ.9,736 మొత్తం జమ కానుంది. రుణమాఫీ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- నాల్గవ విడత ఆసరా పంపిణీకి సిద్ధం
- ఈ నెల చివరిలోపు పొదుపు మహిళల ఖాతాల్లో నగదు జమ చేయనున్న ప్రభుత్వం
- ఇప్పటికే వేలిముద్రలు, ఖాతాల వివరాలను సేకరించిన సిబ్బంది



ఆత్మకూరులో పొదుపు మహిళల సమావేశం (ఫైల్)

ఆత్మకూరు: ఐదేళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో పొదుపు మహిళల కష్టాలు తెలుసుకుని అండగా ఉంటానని, అధైర్య పడొద్దని అభయమిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఉన్న అప్పు మొత్తాన్ని మనందరి ప్రభుత్వం చెల్లించి మీ ఆర్థిక భారాలను తొలగిస్తానని హామీనిచ్చారు. ఆ తరువాత అధికారంలోకి రావడం.. ఆ వెంటనే వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు సంఘాల రుణాలను నాలుగు విడతలుగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించి మొదటి విడత సొమ్మును సంఘాల్లోని మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. మరి కొద్ది రోజుల్లో నాలుగో విడత రుణాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే అధికారులు, సిబ్బంది ద్వారా సంఘాలు, మహిళల బ్యాంక్ ఖాతాలు తదితర వివరాలను సేకరించింది. వైకేపీ అధికారులు కూడా ఎన్ని సంఘాలున్నాయి, ఎంత మొత్తం మంజూరు చేయాలనే నివేదికలను ప్రభుత్వానికి పంపారు.

వివరాలు సేకరించిన వైకేపీ సిబ్బంది..

వైఎస్సార్ ఆసరా పథకం కింద ప్రభుత్వం అందించే నాల్గవ విడత నగదు మంజూరుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో వైకేపీ అధికారులు పొదుపు సంఘాల ఖాతాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడమే కాకుండా బ్యాంక్ ఖాతా, వేలిముద్రలు సైతం సేకరించారు. వీరందరికీ త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి

గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా

వైఎస్సార్ ఆసరా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాల మాఫీ వివరాలను వైకేపీ సిబ్బంది ఇప్పటికే అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా అతికించారు. ఇందులో పొదుపు సంఘంపేరు, సభ్యుల వివరాలు, ఒక్కో సభ్యురాలికి ఎంత నగదు జమ అవుతుంది. తదితర వివరాలను జాబితాలో పేర్కొన్నారు.

మండలాల వారీగా నాల్గవ విడతలో లబ్ధి పొందనున్న సంఘాలు, నగదు వివరాలు..

మండలం	పొదుపు సంఘాలు	మొత్తం నగదు
ఆత్మకూరు	909	రూ.4,54,31,419
వెలుగోడు	879	రూ.7,26,67,224
బండిఆత్మకూరు	773	రూ.4,92,75,941
మహానంది	666	రూ.4,71,37,751

లబ్ధిదారుల వివరాలు పంపాం



ఈ నెలలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడుత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసే అవకాశం ఉన్నందున వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఇప్పటికే ప్రభుత్వ సూచనల మేరకు వివరాలన్నీ అందజేశాం. అలాగే ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయల్లో ప్రదర్శనకు ఉంచాం.

– ఉమామహేశ్వరి ,ఏపీఎం, ఆత్మకూరు

పట్టణాభివృద్ధికి కృషి



7వ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 7వ వార్డులో కౌన్సిలర్ షేక్ నాయబ్ ఆధ్వర్యంలో కమిషనర్ కిషోర్ తో కలిసి డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో సీసీ రోడ్లకు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందన్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. కౌన్సిలర్లు షేక్ నాయబ్, చాంద్‌బాషా, కృష్ణ, కో ఆప్షన్ సభ్యులు గఫార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఆర్టీసీ బాబు, అబూబక్కర్, ఉస్మాన్‌బేగ్, లడ్డు, జబ్బార్, శాలిషా, బ్రహ్మయ్య ఆచారి, అంజి, సలాం పాల్గొన్నారు.

లెనిన్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: లెనిన్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లెనిన్ విప్లవ భావాలు అలవర్చుకున్నారన్నారు. రష్యా జార్ చక్రవర్తుల నిరంకుశ పాలకు వ్యతిరేకంగా శ్రామికులను ఐక్యం చేసి నిరంకుశ పాలనకు చరమగీతం పాడి విప్లవాన్ని విజయవంతం చేశాడని వివరించారు. ప్రపంచంలో మొదటి సారిగా సామ్యవాద ప్రభుత్వాన్ని రష్యాలో ఏర్పాటు చేసి కమ్యూనిస్టులు, విప్లవకారులకు స్ఫూర్తిగా నిలిచారని గుర్తు చేశారు. నాయకులు గోపాల్, తిక్కయ్య, చిన్న పుల్లయ్య, భాస్కర్, రామకృష్ణ, జిలానీ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్ర



మండల స్థాయి క్రికెట్ విజేతగా నిలిచిన టౌన్ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలను ఏర్పాటు చేసిందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పట్టణంలోని హాస్పిటల్ రోడ్డు జట్టు, రామాలయం వీధి జట్టుపై విజయం సాధించింది. దీంతో మండల స్థాయి పోటీలు ముగిశాయి. ఈ నెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి పోటీల నిర్వహిస్తామని చెప్పారు. మండలస్థాయి ఫైనల్‌లో విజయసాధించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాకారులకు ట్రోఫీని నంద్యాల, కర్నూలు జిల్లా శాప్ చైర్మన్లు రవికుమార్, ఎస్ఐ హుసేన్‌బాషా, శ్రీనాథ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఆర్టీసీ బాబు, ఉస్మాన్‌బేగ్, జబ్బార్, వీఆర్ శ్రీను అందజేశారు.

నేడు శ్రీశైలానికి ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆదివారం ఉదయం శ్రీశైలం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ శనివారం తెలిపారు. ఆదివారం శ్రీశైలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే కార్యకర్తలు నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.



పచ్చగా కళకళలాడుతున్న ఆవాల పంట

పుడమికి పచ్చందం

మహానంది: వర్షాభావ పరిస్థితులతో రైతులు పంట మార్పిడి చేస్తున్నారు. దీర్ఘకాలిక పంటలను తగ్గించి స్వల్పకాలిక పంటలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆకు, కాయగూరల పంటలను అధికంగా సాగుచేస్తున్నారు. ఈ క్రమంలో వెంగళరెడ్డిపేట దారిలో కనుచూపు మేర ఆవాల పైరు పసుపు పచ్చని పూతతో కనువిందు చేస్తుంది. దారి వెంట వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

శ్రీశైలం సీఐ బదిలీ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వన్‌టౌన్, టూ టౌన్ సర్కిల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న దివాకర్‌రెడ్డిని శనివారం బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రసాద్‌యాదవ్‌ను సీఐగా నియమించారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

నలుగురి బైండోవర్

మహానంది: తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాలకు చెందిన నలుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో మద్యం విక్రయించే, అల్లర్లకు పాల్పడే వారిపై నిఘా ఉంచినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు, ఘర్షణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలువురి కదలికలపై నిఘా ఉంచామని, ప్రవర్తనలో మార్పు రాకపోతే కటకటాలు తప్పవని స్పష్టం చేశారు.

23న కొలనుభారతిలో ప్రత్యేక సమావేశం

కొత్తపల్లి: కొలనుభారతి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆలయ ఈఓ మోహన్ శనివారం కోరారు. వచ్చే నెల 14వ తేదీన వసంతపంచమి వేడుకలు కొలనుభారతి ఆలయంలో జరగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించవలసిన ఏర్పాట్లపై ఆత్మకూరు ఆర్డీఓ దాసు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు.

తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న రాజు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఇండోర్ స్టేడియంలో శనివారం 37వ ఓపెన్ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాకు క్రీడల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారన్నారు. క్యాడెట్ విభాగంలో 30 మంది, జూనియర్స్ విభాగంలో 40, సీనియర్స్ విభాగంలో 15 మంది బాలికలు పాల్గొన్నారని చెప్పారు. జిల్లా ట్రెజరర్ బిలాల్‌బాషా ఉన్నారు.

ఆర్థిక సాయం

మహానంది: బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన దాసరి పక్కీరమ్మ కూలీ పనుల నిమిత్తం ఆటోలో చాబోలు గ్రామానికి వెళ్తా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన పుల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. లింగాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి వచ్చి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి విషయం తెలుసుకుని శనివారం వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ అర్జున్, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం

శ్రీశైలంప్రాజెక్ట్: సామాజిక సమతామూర్తి అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించడం సమతాసంకల్పంగా అధ్యాపకులు అభివర్ణించారు. స్ఫూర్తి ప్రదాతను నిత్యం తలుచుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విగ్రహ ఏర్పాటుపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలు, జీవిత విశేషాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. బుచ్చయ్య, అధ్యాపకులు కె రాజన్న, ఎం.పద్మ, నిర్మళ, మహేశ్వరరెడ్డి, బాలు, షాజీద, కల్యాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు గౌరవం



వెంగళరెడ్డిపేటలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి
- ఆరు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

మహానంది: పేదలకు గౌరవమిచ్చిన ప్రభుత్వం తమదొక్కటేనని ఎమ్మెల్యే, శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని, అందులో భాగంగా నవరత్నాలు తదితర పథకాలు అర్హతను ప్రామాణికంగా తీసుకొని అందజేసి నూతన విధానాలను రూపకల్పన చేశారన్నారు. బండిఆత్మకూరు మండలం బి.కోడూరు, వెంగళరెడ్డిపేట, కడమలకాల్వ, శింగవరం, సోమయాజులపల్లె, లింగాపురం గ్రామాల్లో సుమారు రూ.3కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని రకాల సేవలను గ్రామస్థాయిలోనే ప్రజలకు అందుబాటులోకి తెచ్చి గ్రామ స్వరాజ్య పాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పేదల సొంత ఇంటి కలను నెరవేర్చారన్నారు. పేదల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్‌నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, వెంగళరెడ్డి పేట సర్పంచ్ పల్లె నాగమణి, కన్వీనర్ పల్లె కృష్ణవేణి , సర్పంచులు మేరీ పుష్పాంజలి, చక్రపాణి, లావణ్య, రాధమ్మ, ఎంపీటీసీ చింతల రామయ్య, నాయకులు పల్లె సోమశేఖర్‌రెడ్డి, పల్లె ఆదిలక్ష్మిరెడ్డి, మహేంద్రారెడ్డి పాల్గొన్నారు.

బొల్లవరంలో మినీట్యాంకుల ఏర్పాటు



బొల్లవరంలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకులు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బొల్లవరం గ్రామంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు జీజీఎం నిధులతో మూడు మినీ నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి పైప్‌లైన్ పనులు చేట్టినట్లు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. గ్రామంలో మినీట్యాంకులను ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, నాయకులు రాఘవరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అదే పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించాలి

పాములపాడు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పిల్లలు చదివే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనే నిర్వహించాలని బహుజన సమాజ్‌పార్టీ నందికొట్కూరు తాలుకా ఇన్‌చార్జ్ లింగాల స్వాములు, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కలబండి అంకన్న, డీజేఎఫ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ కోరారు. శనివారం వారు సేవా భారతీ (వైఆర్‌డీఎస్) కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. లింగాల స్వాములు మాట్లాడుతూ దూర ప్రాంతంలోని పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఒత్తిడికి గురవుతారని, సరిగా రాయక ఫెయిలయ్యే ప్రమాదముందని, కావున అదే పాఠశాలలో పరీక్షలు ఏర్పాటు చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. శ్రీనివాసులు, వెంకటస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో ఈ నెల 22వ తేదీన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.శనివారం వారు మాట్లాడుతూ 22న శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీరమణమూర్తి స్వామి ఆలయంలో వేకువజామున 4.30 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటలకు మహాసుదర్శన యాగం, 10 గంటలకు శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి వ్రతం, మధ్యాహ్నం సీతారాముల కల్యాణం జరిపిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం ఉంటుందన్నారు. 21న ఆదివారం ఉదయం 9 గంటలకు గ్రామదేవతలకు బోనాలు సమర్పిస్తామని చెప్పారు. గత ఏడాది నవంబర్ 13 నుంచి చేపట్టిన శ్రీరామజయరామ జయ జయ రామ అఖండ సంకీర్తన కార్యక్రమం 22న ముగిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు మంజుల, కోశాధికారి లక్ష్మీదేవి, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రజాక్, కార్యదర్శి రామ్‌నాయక్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలన్నారు. సురేంద్ర, ముర్తుజా, ప్రమీళ, లక్ష్మీదేవి, చెన్నమ్మ, ఖాదర్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రాజేంద్రసింగ్

శ్రీశైలంప్రాజెక్ట్: అఖిల భారత యువజన సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం తహసీల్దార్ రాజేంద్రసింగ్ ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ నాయకులు టి.మల్లికార్జున, డి.రాజు, శ్రీనివాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ యువజన సంఘాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సహకారం అందజేయాలని సూచించారు.

ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తిని చాటాలి

- ఎమ్మెల్యేలు శిల్పారవి, ఆర్థర్
- నంద్యాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



ఎమ్మెల్యే శిల్పా రవికి మెమెంటో అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఆర్థర్, ఎమ్మెల్సీ ఇసాక్

నంద్యాల(న్యూటౌన్): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా భావించి క్రీడా స్ఫూర్తిని చాటాలని, నంద్యాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి మొత్తం 450 మంది క్రీడాకారులతో పాటు 60 మంది సిబ్బంది పాల్గొన్నారు. కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి, ఎలమంచలి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నాగరాజు, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, అన్సర్, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.